# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## కేంద్ర కమిటీ

ఫిబ్రవరి 13, 2013

## అఫ్జల్ గురు ఉరిని ఖండించండి!

## ప్రజా ఉద్యమకారులు, జాతి విముక్తి పోరాటకారులు, విప్లవకారులు కాదు, భారత రాజ్యమే అతి పెద్ద టెర్రరిస్టు!

ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యంగా చెప్పుకునే భారత రాజ్యం 9 ఫిబ్రవరి 2013న ఢిల్లీలోని తీహార్ జైల్లో అఫ్జల్ గురును అత్యంత రహస్యంగా ఉరి తీసింది. 13 డిసెంబర్ 2001న భారత పార్లమెంట్‌పై జరిగిన దాడికి సహకరించాడన్న ఆరోపణపై అరెస్టయిన అఫ్జల్ గురుకు తాను నిర్దోషినని నిరూపించుకునే అవకాశాలివ్వకుండా, ఆఖరుకు తాను కోరుకున్న న్యాయవాదులను కూడా ఇవ్వ నిరాకరించిన భారత అత్యున్నత న్యాయస్థానం 'జాతి మనోభావాలను సంతృప్తి పర్చడం' కోసం 2005లో ఉరిశిక్షను ఖాయం చేసింది. పార్లమెంట్‌పై జరిగిన దాడికి సూత్రధారులెవరో, దాని వెనుకున్న కుట్రేమిటో నిష్పక్షపాతంగా విచారణ జరపకుండానే ఈ కేసులో కశ్మీరీ జాతి విముక్తికారులను, ఉద్యమ సానుభూతిపరులను కుట్రపూరితంగా ఇరికించారు.

9/11 దాడుల దరిమిలా అమెరికా ప్రారంభించిన 'గ్లోబల్ వార్ ఆన్ టెర్రర్'లో భాగంగా భారత రాజ్యం జాతి విముక్తి ఉద్యమ సంస్థలను, విప్లవ సంస్థలను టెర్రరిస్టుగా చిత్రీకరిస్తూ కార్పొరేట్ మీడియా ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ వస్తున్నది.  దేశ ప్రజల దృష్టిని తమ తక్షణ, మౌలిక సమస్యల నుండి మళ్లించి 'టెర్రరిజమే' అతి పెద్ద ప్రమాదం అనే భావనను సర్వత్రా వ్యాపింపజేస్తున్నది. కశ్మీర్‌లో, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు, సంఘ్ ముఠాకు చెందిన వివిధ హిందూ మత దురహంకార శక్తులు ఇస్లామిక్ టెర్రరిస్టుల సాకుతో ముస్లింలపై ఏళ్ల తరబడి సాగిస్తున్న ఫాసిస్టు హత్యాకాండలు, అత్యాచారాలు, చిత్రహింసలు, జైలు నిర్బంధాలు, అమానుష వివక్షల ఫలితంగా ముస్లిం ప్రజల్లో అంతులేని ద్వేషం గూడు కట్టుకుంది. దీనిని కొంత మంది ముస్లింలు తమకు తోచిన పద్ధతుల్లో ప్రతిఘటిస్తున్నారు. అందులో ఒక రూపంగా కొన్ని అవాంఛనీయమైన విధ్వంసకర దాడులు కూడ చోటు చేసుకుంటున్నాయి. దీనికి పూర్తి బాధ్యత పాలకవర్గాలదే, హిందూ మత దురహంకార శక్తులదే. అదే సమయంలో భారత ప్రభుత్వానికి చెందిన ఇంటలిజెన్స్ సంస్థలు, అమెరికన్ ఇంటలిజెన్స్ సంస్థలు, హిందూ మతదురహంకార సంఘ్ ముఠాకు చెందిన సంస్థలు కుట్రపూరితంగా దేశంలో అనేక చోట్ల బాంబు దాడులకు, విధ్వంసకర చర్యలకు పాల్పడుతున్నాయి. ప్రభుత్వం, దానికి వంతపాడే మీడియా వీటన్నిటిలో అమాయక ముస్లింలను, జాతి విముక్తి ఉద్యమ సంస్థలను దోషులుగా చూపెడుతున్నాయి. వాళ్లను తప్పుడు కేసుల్లో ఇరికిస్తున్నారు. ఆ సాకుతో ప్రజల న్యాయమైన ఉద్యమాలన్నిటినీ అణచివెయ్యాలనేది భారత రాజ్యం లక్ష్యం. ఈ కుట్రలో భాగమే పార్లమెంట్‌పై నాటకీయంగా జరిగిన దాడి.

ఇంతకాలం అఫ్జల్ గురు ఉరిని వాయిదా వేస్తూ వచ్చిన కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం వచ్చే సంవత్సరం జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీపై పై చేయి సాధించి, 'టెర్రరిజం'పై తనను తాను ఛాంపియన్‌గా నిరూపించుకోవడం కోసమే ఇలా హఠాత్తుగా ఉరితీసింది. ఈ క్రమంలో అది తాను చెప్పుకునే న్యాయ సూత్రాలను కూడ తుంగలో తొక్కింది. క్షమాభిక్ష అపీల్‌ను రాష్ట్రపతి తిరస్కరించిన విషయాన్ని అతని కుటుంబానికి తెలియజేయకుండా, చివరిసారి కుటుంబాన్ని చూసే అవకాశం కూడ ఇవ్వకుండా, ముందస్తుగా కశ్మీర్ లోయ అంతటా కర్ఫ్యూ విధించి ఈ పిరికి చర్యకు పాల్పడింది. ఆఖరుకు అతని శవాన్నైనా కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా – ప్రపంచంలో అతి పెద్ద టెర్రరిస్టు అమెరికా ఒసామా బిన్ లాదెన్ శవాన్ని సముద్రంలో పడవేసినట్టుగానే – జైల్లోనే ఖననం చేసేసి అత్యంత అమానుషత్వానికి పాల్పడ్డది.

అఫ్జల్ గురును ఉరితీసి భారత ప్రభుత్వం కశ్మీరీ ప్రజలతో పాటు, ప్రజాస్వామ్య ప్రియులైన భారత ప్రజలందరి మనోభావాలను తీవ్రంగా గాయపర్చింది. ఇప్పటికి 80 వేలకు పైగా మంది కశ్మీరీ ప్రజలను హతమార్చి, 7 లక్షల సాయుధ బలగాలతో కశ్మీర్ లోయనంతా

సైనిక క్యాంపుగా మార్చినప్పటికీ కశ్మీరీ ప్రజల జాతి విముక్తి ఆకాంక్ష చల్లారలేదనేది వాస్తవం. అఫ్జల్ గురును ఉరితీసి కశ్మీర్ ప్రజల పోరాట చేవను నీరు కార్చగలమని భారత ప్రభుత్వం పగటి కలగంటున్నది. తమ జాతి విముక్తి కోసం, స్వాతంత్ర్యం కోసం కశ్మీరీ ప్రజలు దశాబ్దాలుగా సాగిస్తున్న పోరాటం న్యాయమైనది. అది అనేక ఎగుడు దిగుళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ విభిన్న రూపాల్లో పలు సందర్భాల్లో విస్ఫోటనంలా ఎగుస్తూనే వున్నది. భారత ఫాసిస్టు పాలకుల ఇలాంటి అమానుష చర్యలు కశ్మీరీ ప్రజల్లో మరింత కసినే రగుల్చుతాయి తప్ప వాళ్లను శాశ్వతంగా అణచిపెట్టలేవు.

ఈ ఫాసిస్టు చర్యను భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తీవ్రంగా ఖండిస్తున్నది. ఇలాంటి చర్యలతో పీడిత ప్రజల, జాతుల వుద్యమాలను అణచివెయ్యగలమని పాలకవర్గాలు కంటున్న కలలు కల్లలు కాకతప్పదని హెచ్చరిస్తున్నది. కశ్మీర్ కశ్మీరీ ప్రజలదే. భారత్‌కు గాని, పాకిస్తాన్‌కు గాని దానిపై ఎలాంటి హక్కూ లేదు. కశ్మీరీ ప్రజల జాతి విముక్తి ఉద్యమాన్ని మా పార్టీ పూర్తిగా సమర్థిస్తుంది. దేశాన్ని జాతుల బంధీఖానాగా మార్చిన బడా దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య పాలకవర్గాలకు, వారికి నాయకత్వం వహిస్తున్న సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా దేశంలోని కార్మికులు, కర్షకులు, విద్యార్థి, యువజనులు, దళితులు, ఆదివాసులు, మత మైనారిటీలు మహిళలు, వ్యాపారులు.. యావత్ పీడిత ప్రజలూ, పీడిత జాతులూ సమైక్యంగా పోరాడాలి. కార్మిక, కర్షక, పెటీ బూర్జువా, జాతీయ బూర్జువా వర్గాల ఐక్య సంఘటనగా ఏర్పడబోయే భారత నూతన ప్రజాస్వామిక రాజ్యం కోసం సాగుతున్న పోరాటంతో భుజం భుజం కలిపి నడవడం ద్వారానే జాతులు విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికారాన్ని సాధించుకోగల్గుతాయి. పీడిత ప్రజలందరూ అన్ని రకాల దోపిడీ పీడనల నుండి విముక్తిని సాధించుకోగల్గుతారు.

Abhay

**(అభయ్)**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**